
# ఫేర్ అండ్ లవ్లీ




జొన్నలగడ్డ లలితాదేవి

ఆ రోజు ఆదివారం. ఆదివారం సామాన్యంగా అందరికీ సెలవురోజే. సాయంత్రం సరదాగా అలా కృష్ణా బారేజ్‌కేసి నడిచాడు అశోక్. చల్లని గాలి నదీతరంగాల చల్లదనంతో మరింత చల్లగా శరీరాన్ని స్పర్శిస్తుంటే కృష్ణవేణీ నది ధ్వనులు వింటూ అలా కాసేపు ఆ బారేజ్ మీదుగా నడిచి ఏదో జనంలేని తలుపు దగ్గర నిలబడి కాసేపావిధంగా గడిపి రావడం అతనికి సరదా అయిన విషయం. ఆ రోజూ అలాగే వచ్చాడు.

"ఏరోయ్! ఇటు వేంచేశావు ... ఈ రోజు మీ కొట్టు మూసి సెలవు ప్రకటించగల ఔదార్యం వచ్చేసిందా మీ కొట్టు ఓనర్‌కి?" నవ్వుతూ అన్నాడు ప్రకాశం అతనికి ఎదురు వస్తూ.

"ఈ వారం మధ్యాహ్నం వరకూ ఉంచాడు. వచ్చేవారం మాత్రం రాత్రి పదింటిదాకా తప్పదు వినాయకచవితి పండుగ సందర్భంగా. అందుకని ఇలా వచ్చాను!" మిత్రుడిని చూసిన ఆనందం అశోక్‌లో కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది.



"... వాళ్లకి అంతర్గతంగా మనం చూడాలని, మనల్ని ఆకర్షించి తమ చుట్టూ తిప్పుకోవాలని ఉన్నా, అది చస్తే ప్రకటించరు. అడ్డమైన క్రీములూ పట్టించి ఒంటి ఛాయ మెరుగు పరచుకోవాలన్న తాపత్రయం దేనికంటావూ... ఏదో మగాడు వాళ్ల పట్ల ఆకర్షితుడై మూడు ముళ్లూ వేస్తాడనే. అది ఒప్పుకోవడానికి వాళ్లకి అభిజాత్యం అడ్డు వస్తుంది!"

"అక్కడ మన చంద్రం, విజయ్ ఉన్నారు. రా, పోదాం!" అంటూ అశోక్‌ని తీసుకుని అటుగా నడిచాడు ప్రకాశం.

అశోక్‌ని చూస్తూనే ఆ ఇద్దరూకూడా మహా సరదా పడిపోయారు. "అబ్బ! ఎన్నాళ్లకు కనిపించావు?" అంటూ.

అశోక్ పైకి నవ్వినా మనసులో కాస్త బాధే కలిగింది. తామంతా కలిసి డిగ్రీ పూర్తి చేశారు. తను చదువుకి ఫుల్‌స్టాప్ పెట్టి ఓ ఫ్యాన్సీ షాప్‌లో సేల్స్‌మన్‌గా చేరాడు. ఊరికే ఖాళీగా కూర్చునేకంటే చేతి ఖర్చులన్నా ఉంటాయని. అన్నిటికంటే ముఖ్యోద్దేశం పోటీ పరీక్షలు. వాటికి కట్టాల్సిన డబ్బు తనే సంపాదించుకుంటూ పరీక్షలు రాయాలన్న బలమైన సంకల్పం ఆ విధంగా ఫాన్సీ షాప్‌లో చేరేలా చేసింది. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిదిన్నరదాకా పనిచేసినా ఓనర్ మొహం తుమ్మల్లో పొద్దుగూకినట్టే ఉంటుంది. వాళ్లంతా పి.జి. చేస్తున్నారు హాయిగా. డబ్బుకి లోటు లేదు వాళ్లకి. నలుగురూ కబుర్లలో పడ్డారు. ఆ గాలి అటు తిరిగి, ఇటు తిరిగి ఆడపిల్లల మీదకి మళ్లింది.

"ఈ మధ్యకాలంలో ఆడాళ్లకి బ్యూటీమీద యమా భక్తి పెరిగిపోయిందోయ్! బ్యూటీ పార్లర్ల చుట్టూ తిరగడం, క్రీమ్‌లు పట్టించడం ... అబ్బ! ఎక్కడ చూసినా ఈ ఆడాళ్లే కనిపిస్తున్నారు. ప్రతివాళ్లకీ అందంగా కనపడిపోవాలన్న రంధి పెరిగిపోయింది!" అన్నాడు ప్రకాశం.

"ఎందుకంటావు?" అని అడిగాడు చంద్రం ఆసక్తిగా.

అతనడిగిందే తడవు, మహా ఉత్సాహంగా మొదలేశాడు విజయ్ "ఎందుకేమిటోయ్, మగాళ్ల కంటికి వాళ్లు అందంగా కనిపించాలని. దాంతో మగాడు వాళ్ల అందానికి దాసుడై వాళ్ల చుట్టూ తిరుగుతూండాలని."

"అలా బాగున్నారని మనం కాస్త పలకరిస్తే, సజావుగా జవాబు చెప్పకుండా ముఖాలు మాడ్చుకుని మనల్ని ఓ అంటరానివాడిని చూసినట్లు చూస్తారు!" నవ్వాడు ప్రకాశం.

"ఆ మాటా నిజమే. అలా మనం చూసి ఆనందించాలి. అంతకంటే ఆడపిల్లలమీద ఆశ పెట్టుకోకూడదు. వాళ్లకి అంతర్గతంగా మనం చూడాలని, మనల్ని ఆకర్షించి తమ చుట్టూ తిప్పుకోవాలని ఉన్నా, అది చస్తే ప్రకటించరు. అడ్డమైన క్రీములూ పట్టించి ఒంటి ఛాయ మెరుగు పరచుకోవాలన్న తాపత్రయం దేనికంటావూ... ఏదో మగాడు వాళ్ల పట్ల ఆకర్షితుడై మూడు ముళ్లూ వేస్తాడనే. అది ఒప్పుకోవడానికి వాళ్లకి అభిజాత్యం అడ్డు వస్తుంది!"

అశోక్ అందరి మాటలూ వింటూ ఆలోచిస్తున్నాడు.

"ఏమోయ్, మాట్లాడవు? మా అందరికంటే నీకు కాస్త ఎక్కువ తెలిసి ఉండాలి. ఫాన్సీ షాపులో పని చేస్తున్నావు గనుక ఫేర్ అండ్ లవ్‌లీలు, పీకోలు వగైరా వగైరాలన్నీ రోజుకి ఎన్ని అమ్ముతున్నావు? ఎందరమ్మాయిల్ని చూస్తున్నావు?" అడిగాడు విజయ్ పరిహాసంగా.

"ఏదో వస్తూంటారు, కొంటూంటారు. నేను అంతగా పట్టించుకోను!" అన్నాడు అశోక్.

"అయి ఉండచ్చు. కొనడానికి వచ్చేవాళ్లు, ఓ మెట్టు అందం దిగువ వాళ్లే కదా! అంచేత నీకు నచ్చి ఉండరు!" ప్రకాశం అన్నాడు.

"అన్నట్టు నీకు ఎలాంటి అమ్మాయిలు ఇష్టం?" అని అడిగాడు విజయ్.

"నాకు కాస్త రంగున్న అమ్మాయిలే ఇష్టం!" నిజం చెప్పేశాడు అశోక్.

"నాకెందుకో నల్లని అమ్మాయిలంటేనూ, తెల్లని బట్టలంటేనూ ఇష్టమోయ్!" నవ్వాడు చంద్రం.

"ఈ బ్యూటీ పార్లర్లు, ఈ క్రీముల పుణ్యమాని నీకు కావాల్సిన నల్లవాళ్లు తగ్గిపోవచ్చు. ఎందుకైనా మంచిది ముందుగానే ఓ నల్లపిల్లని కుదుర్చుకో!" కొంటెగా అన్నాడు ప్రకాశ్.

"ఫర్వాలేదులేవోయ్, ఏ పల్లెలో అయినా నాకు దొరక్కపోదులే. అయినా నాకు జత ఎక్కడో పుట్టి పెరిగే ఉంటుంది కదా! ఏదోనాడు 'హ



## నువ్వొక్కత్తివే తక్కువ!

నర్తకిగా, మంచి నటిగా పేరు తెచ్చుకున్న భానుప్రియ తరువాత ప్రవాసభారతీయుణ్ని పెళ్లి చేసుకుని అమెరికాలో స్థిరపడిన సంగతి తెలిసిందే. పెళ్లి అయినా ఆమెకు సినిమాలపై మోజు మాత్రం కొంచెం కూడా తగ్గలేదట. "ఒక మంచి స్క్రిప్టు రాసుకుని దర్శకత్వం చేపట్టాలని నాకు ఎప్పటి నుంచో కోరికగా ఉంది. ఏ పనికైనా టైమింగ్ ముఖ్యం. కనుక దానికోసం ఎదురుచూస్తున్నాను. ఈ స్టేజ్‌లో పరిగెత్తుతూ డైరెక్షన్ చేయడం మంచిదే అనిపిస్తోంది. అందుకే సాధ్యమైనంత త్వరలో ఒక సినిమాకు డైరెక్షన్ చేయబోతున్నాను" అంది. మీ సినిమాలో హీరోయిన్ ఎవరిని అడిగితే నవ్వుతూ "ఎవరో ఎందుకు, నేనున్నాగా!" అని సమాధానమిచ్చింది భానుప్రియ. మరి హీరో ఎవరో?

007

నాథా!' అంటూ తనే వస్తుందిలే!" అంత కొంటెగానూ అన్నాడు చంద్రం.

"ఈకాలం ఆడపిల్లల్ని తక్కువగా అంచనా వేయకోయ్! వాళ్లు కామెంట్స్ చేయడంలో మనల్ని మించిపోయారు. వాళ్ల కలల్లో గ్రీకువీరులు, క్రికెట్టు వీరులు, ఫిలిమ్ స్టార్లూ పరుగెత్తుతూంటారు!" అన్నాడు నవ్వుతూ విజయ్.

"మరే ... వాళ్లకంటే మనం తెగ ముస్తాబయి వాళ్లకి పోజులు కొడుతున్నామని వాళ్లు అదేపనిగా వ్యాఖ్యానించుకుంటున్నారు కూడా!" ప్రకాశం అన్నాడు.

వీళ్ల ఎవరి మాటలూ వినడంలేదు అశోక్. నాకు కూడా ఓ జోడీ పుట్టి పెరిగి ఉంది కదా! ఆమెగారెప్పుడు వచ్చి తలుపు తడుతుందో? ఏమైనా తనకి చక్కని అమ్మాయి కావాలి. ప్రేమించి పెళ్లి చేసుకోవాలి. అదీ తన కోరిక. ఆపూట అలా కబుర్లాడుకుంటూనే ఇంటికి వెళ్లిపోయారంతా.

ఆ రాత్రంతా పచ్చని పసిడిబొమ్మల్లాంటి అమ్మాయిలు అశోక్ కళ్లముందు గిరగిరా తిరిగిపోతూనే ఉన్నారు.

తెల్లవారి మామూలుగా తన షాపుకు వెళ్లిపోయాడు అశోక్.

అతను ఏవో రాక్స్‌లో సర్దుతుంటే, "ఫేర్ అండ్ లవ్లీ ఉందాండీ?" ఏదో సన్నని కంఠం వినిపించినట్లయి తిరిగి చూచాడు. ఇద్దరమ్మాయిలు నిలబడి ఉన్నారు. ఒకామె దోరనిమ్మపండులా ఉంది. మరో ఆమె చాలా నల్లగా ఉంది.

"ఉంది!" అంటూ తీసి టేబుల్ మీద పెట్టాడు ఎవరడిగారో అర్థం కాక. చటుక్కున దోరనిమ్మపండు అందుకుంటుంటే మనసులోనే ఆశ్చర్యపడ్డాడు ఇంత రంగున్న ఆమెకి ఫేర్ అండ్ లవ్లీ ఎందుకు? అనుకుంటూ.

"నాకు కూడా ఒకటి ఇవ్వండి!" నల్లమ్మాయి అడిగింది. మారు మాట్లాడకుండా మరొకటి తీసి అందించాడు. ఆమెకందిస్తూ నిమ్మపండు పిల్లకేసి ఓరగా చూశాడు. అబ్బ! ఈమెవరో చాలా బాగుంది అనుకుంటూ "ఇంకా ఏమైనా కావాలా?" అని అడిగాడామెని.

"కావాలి!" అంటూ ఆమెకి కావలసినవన్నీ చెప్పింది. అన్నీ చకచకా తీసి పెట్టాడు. ఆ నల్లపిల్ల కూడా ఆమెక్కావాల్సినవి చెప్పింది. మొత్తం ఇద్దరికీ విడివిడిగా బిల్లులు వేసి ఇచ్చాడు. ఇంకా యజమాని రాలేదు గనుక తనే కౌంటర్లోకి వెళ్లి డబ్బు తీసుకుని చిల్లరతో సహా బాలెన్స్ ఇచ్చాడు.

"అరే! మీ దగ్గర చిల్లర కూడా ఉందన్నమాట!" వస్తువులన్నీ ప్లాస్టిక్ కవర్లో పెడుతున్న అశోక్ ఆమె మాటకి నవ్వి, "ఏం అలా అడుగుతున్నారు?" అని అడిగాడు.

"మాకు సామాన్యంగా ఎవరూ చిల్లర ఇవ్వరులెండి! సాయంత్రం వెళ్లినా చిల్లర లేదనే అంటారు బస్సువాళ్లలాగే. అలాంటిది మీరు ఉదయమే చిల్లర ఇస్తేనూ?"

"మీరు ఏ టైములో వచ్చినా మా దగ్గర చిల్లర ఉంటుంది. మీకా భయమేమీ అక్కర్లేదు!" నవ్వుతూ అందించా డిద్దరికీ సంచీలు.

"థాంక్స్!" అంటూ మందహాసం చేసి బయటకు నడిచారా ఇద్దరూ. వెడుతూ ఒకసారి ఆమె ఎందుకో వెనక్కి తిరిగి చూసింది. తదేకంగా చూస్తున్న అశోక్ కనిపించాడు. మెల్లగా ఇవతలకు వచ్చేసింది. 'అబ్బ! ఈమె చాలా బాగుంది!' అనుకుంటూ కాస్త ఇవతలకి వచ్చాడు ఆమెను చూడటానికి.

"ఈమె తన కొట్టుకే వస్తూ ఉంటే బాగుండు!" అనుకున్నాడు మనసులో. ఆ రాత్రంతా ఆమె కలల్లోకి వస్తూనే ఉంది. ఆ రాత్రే కాదు, ప్రతి రాత్రీ ఆమె కలలోకి వస్తూనే ఉంది. మరో వారానికి ఆమె మళ్లీ అదే షాపుకు వచ్చింది గాజులు కావాలని. కూడా ఆ నల్లపిల్ల ఉంది. ఆమెను చూడగానే కలిగిన సంతోషాన్ని మనసులోనే దాచుకుంటూ ఆమెకి గాజులు చూపించి, ఆమె కోరిన గాజులు ఇస్తూ రెండు అదనంగా కూడా వేసి ఇచ్చాడు. అలా ఆమె నాలుగయిదుసార్లు వచ్చింది. ఆమె పేరు మధురిమ అని, ఆమె ఫైనల్ ఇయర్ బి.ఏ. చదువుతోందని తెలుసుకున్నాడు. మధురిమనీ అతను అయస్కాంతంలా ఆకర్షించాడని అతను గ్రహించలేదు.


ఆ నల్లపిల్ల ఆమె ఫ్రెండు. పేరు సుగుణ. ఆమె ఏ కాలేజీయో కూడా తెలిశాక ఓసారి సరదాగా ఆమె కాలేజీకి వచ్చే సమయానికి అక్కడే తచ్చాడసాగాడు. ఆమె వస్తూనే అతన్ని గుర్తుపట్టి పలకరించింది. అలా క్రమక్రమంగా పెరిగిన పరిచయం ఆదివారం సాయంత్రం కృష్ణా బారేజ్‌ల దగ్గర కలుసుకోవడం వరకూ వచ్చింది.

తనంటే ఆమెకి ఎలాంటి అభిప్రాయం ఉందో, ఆమెకి తనంటే ప్రేమ ఉందో, ఊరికే స్నేహపూర్వకంగా కబుర్లు చెబుతోందో అర్థం కావడంలేదు అశోక్‌కి. కులాల విషయంలోకి వస్తే తామిద్దరిదీ ఒకటే కులం. అంచేత పెద్దలకి పట్టింపు కులం విషయంలో ఉండదు. కానీ తనలాంటి సామాన్యుడికి ఆమెనివ్వడానికి ఆమె తల్లిదండ్రులకి ఏమైనా అభ్యంతరాలుంటాయేమోనని అశోక్ భయం.

మధురిమ కనుక తనని ప్రేమించి పెళ్లికి వారిని ఎదిరించైనా సంసిద్ధత చూపితే తామిద్దరి కళ్యాణం జరుగుతుంది. లేకపోతే తన ప్రేమ ఎందుకూ పనికిరానిదే అవుతుంది అనుకుంటూ ఏదోవిధంగా తను బయటపడి అడగడం మంచిదేమో అన్న స్థిర నిశ్చయానికి వచ్చాడు.

మొదట్లో ఫేర్ అండ్ లవ్లీ కొనడానికి వచ్చిన ఆమెను చూసి ఈమెకి ఫేర్ అండ్ లవ్లీ దేనికా అనుకున్నాడు. కాస్త పరిచయం పెరిగాక అది ఆమెకి కాదని, ఆమె అక్కకని తెలిశాక సంతోషించాడు. తనకి నచ్చినమ్మాయిది ఒరిజినల్ కలరే అని, అసలామె ఏ క్రీములూ వాడదని తెలిసింది.

ఆరోజు ఆదివారం అలవాటు ప్రకారం మధురిమ, అశోక్‌లు బారేజ్ దగ్గర కలుసుకున్నారు. ఆ ఇద్దరూ ఒకర్ని ఒకరు



తగులుతూన్నట్టు నిలబడి కబుర్లు చెప్పుకుంటూ ఉంటే వనిమీద సీతానగరం వెడుతున్న సుగుణ కళ్లకి ఆ భయంకర దృశ్యం కనపడింది. హృదయం భగ్గుమంది. వాళ్లిద్దరూ ప్రేమించుకుంటున్నారని వెంటనే అర్థమై కసిగా పెదవి కొరుక్కుంది.

తను ఇన్ని క్రీములు పట్టించినా మధురిమకు వచ్చినంత అందం ఎలా వస్తుంది? అందుకే తన నెవరూ ప్రేమించరు. ఏ అబ్బాయీ తనకేసి ప్రత్యేకంగా చూడడు. తనకి గాఢంగా ప్రేమించి పెళ్లి చేసుకోవాలని కోరిక. కానీ అదేరకంగానూ సాధ్యపడదు. తన తండ్రి పడేసే కట్నానికి ఆశపడి ఎవడో ఒకడు తాళి కట్టి తీసుకుపోతాడు. కానీ ప్రేమించి పెళ్లాడిన థ్రిల్ ఎలా వస్తుంది? తన క్లాస్‌మేట్ తనతో క్లోజ్‌గా తిరిగే మధురిమకి బాయ్‌ఫ్రెండ్! అక్కసుగా అనుకుంది సుగుణ.

అయినా అతగాడేమన్నా గొప్ప ఆఫీసరా, గొప్ప చదువరా? ఏదో ఓ ఫాన్సీ షాపు గుమాస్తా. గట్టిగా ఓ పూట హోటల్‌కి కూడా తీసుకుపోలేని దరిద్రుడు. అలాంటివాడితో ప్రేమేమిటి? అనుకుంది తనలో తనే ఓదార్పుగా. అయినా అది క్షణంసేపే! వెంటనే ఎదురు తిరిగింది మనసు. పెద్ద ఆఫీసరు, గొప్ప చదువరీ కాకపోతేనేం, అతను చూపులకి హీరోలా ఉన్నాడు. చూస్తుంటేనే మళ్లీ చూడాలనిపిస్తాడు. చెప్పుకోవడానికైనా ఓ బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడు. పెళ్లి చేసుకున్నా, చేసుకోకపోయినా జాలీగా తిరగచ్చు కదా! మిగిలిన ఫ్రెండ్స్ అందరి కళ్లూ కుట్టేట్టు ... ఇలాగే ద్వంద్వమైన ఆలోచనలతో మనసు రగులుతోంది సుగుణకి.


"మధురిమా! ఇలా సూటిగా అడిగాననుకోకు, నీకు నేనంటే ఇష్టమేనా?" అడిగాడు అశోక్.

"ఇష్టం లేకపోతే ఇలా మీతోపాటు బారేజ్‌ల చుట్టూ తిరగడం దేనికి?" చిలిపిగా అడిగింది మధురిమ.

"ఆ ఇష్టం ఎలాంటిదో నాకు తెలియాలి. అది మన పెళ్లితో ముడిపడుతుందో, లేదా నువ్వు సూటిగా చెప్పు!"

"నా వరకూ నాకు మిమ్మల్ని చేసుకోవడానికేం అభ్యంతరం లేదు. కానీ మా అక్క పెళ్లి అవ్వాల్సి ఉంది. అది అడ్డు చెబుతారేమోనని ఆలోచిస్తున్నాను!" మెల్లగా అంది మధురిమ.

ఆ సమాధానానికి చాలా




సంతోషపడిపోయాడు అశోక్.

"మరి మీవాళ్లు?" అడిగింది మధురిమ.

"వాళ్లకి ఏమీ అభ్యంతరాలు లేవు, మధూ! నువ్వు నాదానివి అవుతానంటే మీ అక్క పెళ్లి అయ్యేదాకా వెయిట్ చేయమన్నా నేను వెయిట్ చేస్తాను. ఇలాగే మనం కల్సుకుంటూ మన ప్రేమను పదిలంగా కాపాడుకుందాము. నా క్కూడా కాలం కలసివస్తే ఈలోగా మంచి జాబ్ వస్తే నా కిక ఏ దిగులూ ఉండదు!" ఆప్యాయంగా ఆమె చెయి మృదువుగా నొక్కాడు అశోక్.

"మీ వాళ్లకి నా విషయం చెప్పారా?"

"ఆc, చూచాయగా చెప్పేశాను!" అంతే! ఆ చేయి సున్నితంగా తన పెదవులకద్దుకుంది. మధురిమ మనసు వరద కృష్ణవేణిలా పొంగుతోంది.

"పద, మధూ! వెళ్లిపోదాం. నీకు పరీక్షలు కదా! బాగా చదువు, క్లాస్ తెచ్చుకోవాలి మరి!" అన్నాడు లాలనగా.

అలాగే నన్నట్లు తల పంకించింది. ఇద్దరూ ఎవరి దారిన వారు వచ్చేశారు. ఒకరి ఇంటి అడ్రస్సులు ఒకరు తీసుకున్నారు. సెలవులిస్తే పరీక్షల హడావుడిలో ఆమె బారేజ్ దగ్గరకి రాకపోతే కనీసం ఆమె గుమ్మంలో నుంచైనా తను చూసి వెళ్లవచ్చని అతడి ఆశ. తనింటికి రమ్మని ఆహ్వానించి వచ్చాడు.

ఇది జరిగిన రెండు రోజులకి "ఎవడయ్యా మీ షాపులో గుమస్తా?" అరిచినట్టే అంటున్న వ్యక్తిని చూసి ఉలిక్కిపడ్డాడు అశోక్. ఆ వ్యక్తి వెనుక సుగుణ ఉంది.

"అతనేనండీ! ఏం?" అని అడిగాడు ఆశ్చర్యంగా షాపు ఓనరు.

అంతే! దూకుడుగా వచ్చేశాడాయన "ఏమోయ్! ఆఫ్టరాల్ ఫ్యాన్సీ షాపులో కుర్రాడివి. నీకు ప్రేమలు కావాల్సి వచ్చాయా? ఏం? పది కాలాలు బతకాలని లేదా?" గాండ్రిస్తున్న అతన్ని చూసేసరికి సగం కథ అర్థమై కానట్లుంది అశోక్‌కి.

"మీ రెవరు?" ఆశ్చర్యంగా అడిగాడు అశోక్.

"ఎవరినా? మధు తండ్రిని. మా అమ్మాయి అందంగా ఉందని, చదువుకున్న పిల్ల అని వలలో వేసుకుని ఏదో మానుంచి రాబట్టుకుందామని ఎర వేస్తున్నావేమో. అదేం కుదరదు. నీ ముష్టి జీతానికి ... నీ ముష్టి బతుక్కి ప్రేమలు కావాల్సి వచ్చాయా? అందుకు నా కూతురే దొరికిందా? గట్టిగా తిండిపెట్టలేని నీ జీతానికి పిల్లనిచ్చేస్తా ననుకున్నావా?" నాన్ స్టాప్‌లా సాగిపోతోందా నోరు.

"మీరు ఆవేశపడతారు దేనికి? కాస్త స్థిమితంగా మాట్లాడుకుందాం, అలా పదండి!" అన్నాడు అశోక్.

"నీతో నాకేమిటయ్యా మాటలు? మా అమ్మాయి జోలికి వచ్చావంటే ఏ కీలుకాకీలు విరిచేస్తా! జాగ్రత్త! అయినా, ఇలాంటి వారినా షాపుల్లో వేసుకునేది? ఆడపిల్లలింక నీ షాపుకు రావాలా, అక్కర్లేదా?" ధాటీగా అడిగాడు ఓనర్ని.

తల కొట్టేసినట్లయింది ఓనర్‌కి. తీక్షణంగా చూశాడు అశోక్‌వంక.

"ఏదో బుద్ధిమంతుడివని, డిగ్రీ చదివావని ఇంతకాలం నిన్ను ఎంతో గౌరవంగా చూశాను. ఇలా అయితే నా ఫ్యాన్సీ షాపుకు చెడ్డపేరు వస్తుంది. ఎవరూ రారు కూడా. ఈరోజు వరకూ

లెక్కచూసి ఇస్తాను, పని మానేసి పో!" తీవ్రంగా అంటున్న ఓనరు మాటలకి హృదయం గాయపడింది అశోక్‌కి.

"అదయ్యా మాట అంటే!" అంటూ ఓనర్‌ని ప్రశంసించి, "పదమ్మా, సుగుణా! నువ్వు చెప్పబట్టి నేను తొందరగా కళ్లు తెరిచాను. మా పిల్ల పాడైపోకుండా కాపాడుకున్నా!" అంటూ సుగుణని ప్రశంసిస్తూంటే, 'ఓహో... ఇది నీ చలవా!' అనుకున్నాడు మంటగా అశోక్.

ఆ రోజువరకూ జీతం ఇచ్చేసి పంపించేశాడు ఓనరు. అది జేబులో పెట్టుకుని దిగాలు పడిన ముఖంతో ఇంటికి వచ్చాడు.

"ఏరా, వచ్చేశావేం? ఒంట్లో బాగాలేదా?" ఆదుర్దాగా అడిగింది అతని తల్లి గాయత్రి.

జరిగిందంతా చెప్పేశాడు అశోక్. అంతా విన్నాక, "వెధవ ఉద్యోగం పోతే పోయింది. మరోటి రాకపోదులే! ఇంతకీ నువ్వు ఆ పిల్ల ఇంటివైపు వెళ్లకు. ఆ పిల్లకీ విషయులు తెలిసి ఇలా వస్తుందో, ఏం చేస్తుందో చూద్దాం!" అంటూ ఓదార్చి టీ తెచ్చి అందించింది. ఆ టీ తాగి మంచం మీద వాలిపోయాడు.

వెంటనే సుగుణ గుర్తు వచ్చింది. ఛీ! ఏం మనిషి? ఆ క్రీమ్‌లూ, ఈ క్రీమ్‌లూ పట్టిస్తే ఏదో కాస్త ముఖం తెల్లబడుతుందేమో గానీ, మనసులో పేరుకున్న అసూయను ఏ ఫేర్ అండ్ లవ్లీ మార్చుతుంది? వంకర శరీరాలని ప్లాస్టిక్ సర్జరీతో సరిచేయవచ్చేమో గానీ, వక్ర మనసుని ఏ సర్జరీతో సరిచేస్తారు? ఏం, గుమాస్తా అయితే మాత్రం హృదయం ఉండదా? ప్రేమనేదాన్ని ధనవంతులు, గొప్ప ఉద్యోగులు, పెద్ద చదువుకున్నవాళ్లే గుత్తకి తీసుకున్నారా? ఎవడి అదృష్టాన్నిబట్టి వాడు సంపాదిస్తాడు. కానీ భగవంతుడు సృష్టించింది ఎవడికైనా గుప్పెడు మనసే! మమతలకి, అనురాగాలకి ఉద్యోగాలు, డాబుదర్పాలూ తెలుస్తాయా? మనసు మనసునే కోరుతుంది. అది ఎప్పుడు ఎవరివైపు పరుగెడుతుందో ఏ మహానుభావుడూ చెప్పలేడు.

తండ్రి రాగానే అంతా చెప్పేసింది తల్లి. అంతా విని, ఆయన "ఆ పిల్లకిష్టమై మనింటికి వస్తే మీ ఇద్దరికీ మేమే దగ్గరుండి పెళ్లి జరిపిస్తాంరా, దిగులు పడకు! కావాల్సింది ఆ అమ్మాయికి నీ మీద ఎంత ప్రేమ ఉందన్నదే!" అంటూంటే, "డాడీ! నిజంగా మీ మనసు చాలా గొప్పది!" అన్నాడు చిన్నపిల్లాడిలా అతని ఒళ్లో తల దాచుకుంటూ.

"నా మనసు ఎంత గొప్పదో పాతికేళ్ల కిందటే మీ అమ్మకి తెలుసులేరా! మాదీ ప్రేమ వివాహమేగా! నా కీ విషయంలో కూడా వారసుడివే నువ్వు!" ప్రేమగా కొడుకు తల నిమిరాడు చక్రధరరావు.

తండ్రి అశోక్‌ని షాపు దగ్గరకి పోయి అల్లరి చేయడమే గాక ద్యోగం కూడా ఊడపీకించాడని విన్న మధురిమ ఆగ్రహోదగ్రురాలైంది.

"ఏం, అతగాడి కేం తక్కువ? మన కులంవాడు! డిగ్రీ చదివాడు. ఏదో టైమ్ బాగుండో బాగాలేకో షాపులో గుమాస్తా అయినంత మాత్రాన మీరింత గోంగూరకాడలా ఏరిపారేస్తారా!" తీవ్రంగా అడిగింది తల్లిని.

"బాగుంది, ఏదో కట్నం, కానుకలతో మంచి సంబంధం చూసి చేద్దామని కదా మా తాపత్రయం!"

"అవునవును, అప్పులు చేసుకుంటూ మంచి సంబంధం అంటూ ఇవ్వలేని కట్నానికి వాళ్లని మభ్యపెట్టి పెళ్లి చేసి కట్నాలు బకాయిలు పెట్టడం, వాళ్లు మిగిలింది తెస్తే గానీ వీల్లేదని గొడవ పెట్టడం ... అక్కడ సూటీపోటీ మాటలు ... ఇవన్నీ ఎందుకు వస్తాయి? మీరలా ఆలోచించడం వల్లే. మీ రివ్వగలిగినదే ఇచ్చి, ఓ బుద్ధిమంతుడైన ఏ సామాన్యుడికో ఇచ్చి చేస్తే ఏ పొరపొచ్చాలూ లేకుండా బతకలేమేమిటి? అదృష్టం బగుంటే మేమే సంపాదించుకుంటాము. అయినా నేను ఒక్క విషయం చెబుతున్నాను. నూరు ఆరయినా, ఆరు నూరయినా నేను అతన్నే పెళ్లి చేసుకుంటాను. మీరు సగౌరవంగా పిలిచి పెళ్లి చేస్తారా చేయండి, లేదంటే నేనే వెళ్లి అతన్ని చేసుకుంటాను. మీలాంటి ఇరుకు మనసులు గావు అతని తల్లిదండ్రులవి!" విసురుగా తన గదిలోకి వెళ్లిపోయి చకచకా బట్టలూ, పుస్తకాలూ సర్దుకుంది. ఓ పక్కగా ఉంచి బయలుదేరింది.

తన ఇల్లు వెతుక్కుంటూ వచ్చిన మధురిమను చూసి పొంగిపోయాడు అశోక్. తల్లిదండ్రులను పరిచయం చేశాడు. పిల్ల చాలా బాగుంది. డిగ్రీ చదివిందని సంతోషించిన చక్రధరరావు "నీకు నిజంగా మా అబ్బాయిని చేసుకోవాలని ఉంటే మేము మీ పెళ్లి జరిపిస్తాం. మీ వాళ్లకిష్టం లేకపోయినా. నీ ఇష్టం అంతా!" అని ఊరుకున్నాడు. రెక్కలు తప్ప ఆస్తే లేని చక్రధరరావు.

"పరీక్షలయ్యే వరకూ వాళ్లకి టైమిస్తా మావయ్యగారూ! వాళ్లు దారికి రాకపోతే మీరే తండ్రి, మామగారూ అన్నమాట!" అంది వినయంగా నమస్కరిస్తూ.

మందహాసం చేశాడు చక్రధరరావు. అక్షరాలా అదే జరిగింది చివరికి. చిన్న కూతురి పట్టుదలకి లొంగివచ్చినా, పెళ్లి కాని పెద్ద కూతురి వల్ల అతగాడు ముందడగు వేయలేకపోయాడు మధురిమ తండ్రి. కానీ, చాటుగా పెళ్లికి రావడం గమనించి తనలో తనే నవ్వుకున్నాడు చక్రధరరావు. తనవంతు మర్యాదలు చేసి అతగాడి తల మరింత నేలకంటించాడు. పెళ్లయిన రెండోరోజే మరో ఉద్యోగం వచ్చింది అశోక్‌కి. భవిష్యత్తులో అతడే గజిటెడ్ ఆఫీసరు కాగలడని మాత్రం ఎవరూ ఊహించలేదు. ■

